క్లుప్తంగా

పెద్దగుట్టపై గీతాపారాయణం



జడ్చర్ల టౌన్‌: బాదేపల్లి పెద్దగుట్టపై శ్రావణ మాసం ఉత్సవాలు పురస్కరించుకుని మంగళ వారం భక్తులు సంపూర్ణ భగవత్‌ గీతాపారాయణం, విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. బాదేపల్లి భక్తబృందంతోపాటు రాజాపూర్‌ మండలం కుచ్చర్‌కల్‌కు చెందిన భక్తబృందం పారాయణం చేశారు. వీరికి ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి పూర్ణకుంభ స్వాగతం పలికారు. పారాయణం సందర్భంగా భక్తులు రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఆన్‌లైన్‌ సర్వే



నవాబుపేట: ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఆన్‌లైన్‌ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్‌ తెలిపారు. మంగళవారం మండలంలోని గురుకుంటలో ఆన్‌లైన్‌ సర్వే చేసి లబ్ధిదారుల నమోదును ప్రారంభించారు. ప్రభుత్వం ద్వారా ఇల్లు మంజూరైన వారికి సంబంధించి పూర్తి సమాచారంతో సర్వే నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రత్యేక యాప్‌కు దీన్ని పూర్తిగా అనుసంధానం చేసే ప్రక్రియ జరుగుతుందని, దీంతో నిజమైన లబ్ధిదారులు తమ ఇంటిని నిబంధనల ప్రకారం నిర్మించుకుంటే వారికి బిల్లు విషయంలో ఎలాంటి ధోకా ఉండదన్నారు. అందుకు ఈ ఆన్‌లైన్‌ సర్వేకు లబ్ధిదారులంతా సహకరించాలని సూచించారు. మండలంలో 655 ఇళ్లు మంజూరు కాగా లబ్ధిదారులు దాదాపుగా 4వందల వరకు నిర్మాణం చేపట్టినట్లు ఎంపీడీఓ వివరించారు. మిగతావారు వెంటనే ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టాలని సూచించారు. సర్వేలో ఈఓపీఆర్‌డీ నసీర్‌ అహ్మద్‌, ఏఈ శ్రావణి, ఏపీఓ జ్యోతి తదితరులు ఉన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని పీఆర్టీయూ సంఘం నేతలు డిమాండ్‌ చేశారు. ఈమేరకు మహబూబ్‌నగర్‌ రూరల్‌ మండలం పీఆర్టీయూ అధ్యక్షుడు అంజయ్య, రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓబులాయపల్లి, మాచన్‌పల్లి, పోతన్‌పల్లి, రామచంద్రాపూర్‌, పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. సీపీఎస్‌ రద్దును డిమాండ్‌ చేస్తూ సెప్టెంబర్‌ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ, ఉద్యోగులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు సీతారాములు, రామ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పీయూలో క్యాంటీన్‌ ప్రారంభం



మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: పీయూలో భవన నిర్మాణం పూర్తయిన ప్రారంభానికి నోచుకోని క్యాంటీన్‌ను విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ మేరకు ఎంఎస్‌ఎఫ్‌ రాష్ట్ర నాయకులు కార్తీక్‌ మాట్లాడుతూ.. సుదీర్ఘ ప్రాంతాల నుంచి పీయూకు వివిధ పనుల నిమిత్తం వచ్చే డిగ్రీ, పీజీ, బీఈడీ, ఫార్మసీ విద్యార్థులకు ఎలాంటి కనీస వసతులు లేకపోవడం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. భవనం పూర్తయినా అధికారులు ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. గతంలో క్యాంటీన్‌ను ఓపెన్‌ చేయాలని వీసీకి వినిపత్రం ఇస్తే ఇప్పటికీ ప్రారంభించకపోవడంతో విద్యార్థి సంఘాల తరఫున ప్రారంభించామన్నారు. ఇకనుంచి క్యాంటీన్‌ను ప్రతిరోజూ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్‌ నాయకులు గణేశ్‌, కమలాకర్‌, దేవరాజు, చంద్రిక, పూజిత, విజయ, రవితేజ, శివకుమార్‌, మనోహర్‌, శ్రీనివాసులు తదితరులుపాల్గొన్నారు.

ప్రాంగణం.. నిరుపయోగం

- మూతపడ్డ దేవరకద్ర బస్టాండ్‌
- బస్సుల రాకపోకలు లేక వెలవెల
- ఆర్‌ఓబీ నిర్మాణంతో కొత్త సమస్య
- బస్సులను రోడ్డుపైనే నిలుపుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మహిళలు, పిల్లలు, వృద్ధులకు తప్పని పాట్లు
- పరిష్కారం చూపని ఆర్టీసీ అధికారులు



బస్సుల రాకపోకలు లేక వెలవెలబోతున్న దేవరకద్ర బస్టాండ్‌

దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గ కేంద్రం నుంచి నిత్యం ఇటు మహబూబ్‌నగర్‌, హైదరాబాద్‌, అటు నారాయణపేట, మక్తల్‌, ఆత్మకూర్‌, కర్ణాటకలోని పలు ప్రాంతాలకు బస్సులు వెళ్తుంటాయి. ప్రతిరోజూ దేవరకద్ర మీదుగా దాదాపు 4వందల బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కూడళిగా ఉన్న దేవరకద్రలో ఏడాదిన్నరగా బస్టాండ్‌ మూతపడిపోయింది. కారణం ఆర్వోబీ నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ సమస్య ఏర్పడింది. ఆర్వోబీ ప్రారంభం కాకముందు బస్సుల రాకపోకలతో కళకళలాడిన బస్టాండ్‌ ఇప్పుడు దైన్యస్థితిలో వెలవెలబోతున్నది. బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచి పోవడంతో బస్టాండ్‌లోని ఆర్టీసీ షాపులన్నీ మూతపడ్డాయి. బస్టాండ్‌ బయట చుట్టుపక్కల వ్యాపార కేంద్రాలన్నీ మూసివేసి ఇతర ప్రాంతాలకు తరలించారు. ప్రజల రాకపోకలు కూడా లేకపోవడంతో నిర్మానుష్యంగా కనిపిస్తున్నది.

రోడ్లపైనే నిలుపుతున్న బస్సులు

దేవరకద్రలో ఆర్టీసీ బస్సులు, కర్ణాటక బస్సులను ఆర్వోబీకి రెండువైపులా రోడ్లపైనే నిలుపుతున్నారు. దీనివల్ల మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇతర ప్రయాణికులు, విద్యార్థులు రోడ్లపై నిలబడి బస్సుల కోసం వేచి



రోడ్డుపై ఆగిన బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

చూడాల్సి వస్తున్నది. ఇక ఆర్టీసీ వారు కనీసం తాత్కాలిక షెల్టను కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు వానలో తడుస్తూ, ఎండలో నిలబడి ఇబ్బందులు పడుతూ బస్సులను ఎక్కాల్సి వస్తున్నది.

సర్వీసు రోడ్లు సక్రమంగా లేకనే..

దేవరకద్రలో నిర్మించిన ఆర్వోబీకి రెండు వైపులా సర్వీసు రోడ్లు సక్రమంగా లేకపోవడం, వాహనాలు మలుపుకోడానికి యూటర్న్‌లు లేకపోవడంతో బస్సులు బస్టాండ్‌లోకి రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా పోయింది. పాత బస్టాండ్‌ వైపు ఉన్న ఆర్వోబీకి ఒకపక్క నుంచి సర్వీసు రోడ్డు ఉండగా మరోవైపు కొంతమేర సర్వీసు రోడ్డు ఉండగా.. పశువుల సంత, పాత గ్రామపంచాయతీ వద్ద సర్వీసు రోడ్డు నిర్మించలేదు. ఇక కొత్త బస్టాండ్‌ వద్ద ఇదే పరిస్థితి ఉంది. ఒకవైపు సర్వీసు రోడ్డు ఉండగా మరోవైపు ఇరుకైన దారి ఉంది. దీనివల్ల వ్యాపార కేంద్రాలను ఇతర ప్రాంతాలకు తరలించారు. ఆర్వోబీ నిర్మించినప్పుడే సర్వీసు రోడ్లు నిర్మించాలని ప్రతిపాదన ఉన్నా.. కాంట్రాక్టర్‌ పనులను వదిలి వేయడంతో అసంపూర్తిగా మిగిలాయి. ప్రస్తుతం మున్సిపాలిటీగా మారడంతో సర్వీసు రోడ్లను నిర్మించే ప్రతిపాదనలు చేశారు.

పరిశీలనకే పరిమితం

దేవరకద్రలో వీరప్పయ్య షాపింగ్‌ కాంప్లెక్స్‌ వద్ద తాత్కాలికంగా బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసి బస్సుల రాకపోకలకు అనువుగా రోడ్లను వేస్తామని ఆర్టీసీ అధికారులు పలుమార్లు స్థల పరిశీలన చేశారు. కాని ఆచరణలో మాత్రం అమలు చేయలేదు. అలాగే ప్రస్తుతం రిక్వెస్ట్‌ స్టాప్‌లు ఉన్నచోట ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో బస్సుల కోసం వేచిఉండే వారు నానా తంటాల పాలవుతున్నారు. ఇక చిన్నపిల్లలతో వచ్చే మహిళలు తమపిల్లలను రోడ్డుపై వెళ్లకుండా అప్రమత్తంగా ఉండే పరిస్థితులు ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి దేవరకద్ర బస్టాండ్‌ విషయంలో తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆయిల్‌పాం సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

- కలెక్టర్‌ విజయేందిర బోయి



ఆయిల్‌ పాం తోటను పరిశీలిస్తున్న కలెక్టర్‌ విజయేందిర బోయి

భూత్పూర్‌: ఆర్థికంగా బలోపేతం కావడానికి రైతులు ఆయిల్‌ పాం సాగుకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్‌ విజయేందిర బోయి అన్నారు. మండలంలోని తాటికొండ శివారులో ఆయిల్‌ పాం తోటను మంగళవారం కలెక్టర్‌ పరిశీలించారు. 4.5ఎకరాల్లో మహిళా రైతు మంజుల ఆయిల్‌ పాం సాగు చేస్తుండగా కోతకు వచ్చిన గెలల కత్తిరింపులను పరిశీలించి దిగుబడి గురించి ఆరా తీశారు. ఇప్పటి వరకు 29 మెట్రిక్‌ టన్నుల ఆయిల్‌ పాం గెలలను కోసి కంపెనీకి విక్రయించడం ద్వారా రూ.4.32లక్షల ఆదాయం లభించినట్లు సదరు రైతు కలెక్టర్‌కు వివరించారు. ఆయిల్‌ పాం తోటలకు ఎకరాకు రూ.50వేలను ప్రోత్సాహకరంగా అందిస్తున్నట్లు కలెక్టర్‌ రైతులకు వివరించారు. డ్రిప్‌ ఇరిగేషన్‌ కోసం సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. హస్నాపూర్‌కు చెందిన శేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తోటల గురించి కలెక్టర్‌ వారితో చర్చించారు. 25 ఎకరాల్లో సాగు చేస్తున్న ఎగ్గని నర్సింహులు, కొత్త మొల్గరకు చెందిన చింతకాయల రాములు తోటలను పరిశీలించారు. జిల్లాలో 4,298 ఎకరాల్లో ఆయిల్‌ పాం తోటలను రైతులు సాగుచేస్తున్నట్లు కలెక్టర్‌ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి వేణుగోపాల్‌, అధికారులు అనిల్‌కుమార్‌, స్వప్న, ఫ్రీ యూనిక్‌ ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ జోనల్‌ మేనేజర్‌ రాకేశ్‌, జిల్లా ఏరియా మేనేజర్‌ బాలరాజు ఉన్నారు.

రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు పరిష్కరించాలి



అడ్డాకులలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ నర్సింహారెడ్డి

అడ్డాకుల: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని అదనపు కలెక్టర్‌ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయాన్ని మంగళవారం రెవెన్యూ అడిషనల్‌ కలెక్టర్‌ సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్దకు వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి రెవెన్యూ సదస్సులకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. తహసీల్దార్‌ శేఖర్‌తో వివరాలు తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును పరిష్కరించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా గతంలో పెద్దవాగు నుంచి ఇసుక అనుమతులను ఏ విధంగా ఇచ్చారనే దానిపై ఆరా తీసి అందుకు సంబంధించి అనుమతి పత్రాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత రాకుండా చూడాలని చెప్పారు. ఆన్‌లైన్‌ ద్వారా ఇసుక బుక్‌ చేసుకున్న వారికి ఏ విధంగా తరలిస్తున్నారని అడిగారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌ ఖలీద్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ గోపాల్‌, ఆర్‌ఐ సృజన్‌ తదితరులు ఉన్నారు.

ఫైపెచ్చులూడి పడిన జీపీ భవనం

- కార్యదర్శికి తృటిలో తప్పిన ప్రమాదం
- పంచాయతీ సామగ్రి ధ్వంసం



పెచ్చులు ఊడిన ఘటనలో ధ్వంసమైన పంచాయతీ సామగ్రి

దేవరకద్ర రూరల్‌: పంచాయతీ భవనం పెచ్చులూడి పడి కార్యదర్శికి తృటిలో ప్రమాదం తప్పగా, పంచాయతీ సామగ్రి ధ్వంసమైన ఘటన మంగళవారం వెంకటాయపల్లిలో చోటుచేసుకుంది. గ్రామపంచాయతీ భవనాన్ని దాదాపు 30ఏళ్ల క్రితం నిర్మించారు. అందులో కొంతభాగం మూడు నెలల క్రితం కూలిపోయింది. గత్యంతరం లేక అదే భవనంలో ఒక వైపున్న గదిలో పంచాయతీ కార్యదర్శి శివ విధులు నిర్వర్తిస్తున్నాడు. మిగిలిన గది కూడా మధ్యాహ్నం పూర్తిగా పెచ్చులు ఊడి కిందపడింది. ప్రమాదాన్ని ముందే గ్రహించి కార్యదర్శి పక్కకు తప్పుకోగా, పెచ్చులు మొత్తం ఫర్నీచర్‌, సామగ్రిపై పడటంతో ధ్వంసమయ్యాయి. రెండు నెలల కిందట ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ నిధుల నుంచి నూతన భవనం కోసం రూ.20లక్షలు కేటాయించగా.., స్థలం ఎంపిక కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. అధికారులు స్పందించి భవనం పనులు తొందరగా ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేటినుంచి కురుమూర్తి స్వామి పవిత్రోత్సవాలు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి ఆలయంలో శ్రావణమాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు పవిత్రోత్సవాలు అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. లక్ష్మి అమ్మవారికి కుంకుమ అర్చన, గురువారం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, శుక్రవారం స్వామివారికి అభిషేకం, పవిత్రావరోహణం, నివేదన కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ చైర్మన్‌ గోవర్ధన్‌ రెడ్డి, ఈఓ మదనేశ్వరెడ్డి కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి ఇందిర

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: అందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి ఇందిర అన్నారు. మంగళవారం హన్వాడ మండలంలోని టంకర జెడ్పీహెచ్‌ఎస్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. బాలల హక్కులు, విద్యా హక్కు, ఫోక్స్‌, ర్యాగింగ్‌ నిషేధం తదితర చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్‌ హెచ్‌ఎం రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సాయన్న, నూర్జహాన్‌, బలరాం, సాముల చెన్నయ్య, పారా లీగల్‌ వలంటీర్‌ ఎం.సురేష్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

8న పాలమూరు సాహితీ పురస్కారం ప్రదానోత్సవం

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్న కవులకు 15 ఏళ్లుగా పాలమూరు సాహితి కవితా సంపుటాలకు పురస్కారాలు అందజేస్తున్నదని సాహితి అధ్యక్షుడు డాక్టర్‌ భీంపల్లి శ్రీకాంత్‌ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరానికి ప్రముఖ కవి డాక్టర్‌ కాంచనపల్లి గోవర్ధన్‌ రాజు రచించిన 'పెంకుటిల్లు' కవితాసంపుటి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ పురస్కారం కింద శాలువా, మెమొంటోలతోపాటు రూ.5,116 నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. ఈనెల 8వ తేదీన జిల్లా కేంద్రంలోని లిటిల్‌ స్కాలర్‌లో సాయంత్రం 5 గంటలకు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువకవి బోల యాదయ్య పుస్తక పరిచయం చేస్తారని తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం

మహబూబ్‌నగర ఎడ్యుకేషన్‌: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని డీడబ్ల్యూఓ జరీనాబేగం పేర్కొన్నారు. ఈమేరకు మహబూబ్‌నగర్‌ రూరల్‌ మండలంలోని మణికొండ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు కొన్నినెలలపాటు తల్లిపాలను తప్పకుండా పట్టించాలని, ఆరోగ్యరమైన వాతావరణంలో పెరిగేందుకు పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు. బిడ్డ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ శైలశ్రీ, సూపర్‌వైజర్‌ సరితారాణి, మెడికల్‌ ఆఫీసర్‌ శరత్‌ బాబు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు

భూమిలో భాగం అడిగితే దాడి: కేసు నమోదు

నవాబుపేట: గ్రామంలో ఉన్న భూమిని తల్లిదండ్రుల మరణం అనంతరం సంతానం మొత్తం సమానంగా భూమిని పంచాలని అడిగితే దాడి చేశాడంటూ బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చౌడూర్‌కు చెందిన సుంకరి చంద్రశేఖరయ్య, మణెమ్మకు ఐదుగురు కుమారులు, కుమార్తె. వీరికి చౌడూర్‌లో 146, 147, 340, 341 సర్వే నంబర్లలో 20ఎకరాల భూమి కలదు. వారిలో పెద్ద కుమారుడు శివకుమార్‌ తల్లిదండ్రుల మరణం అనంతరం ఎవరికీ తెలియకుండా 4ఎకరాల భూమిని తనపేరున పట్టా చేసుకున్నాడు. తాజాగా భూమి విషయంలో అందరికీ పంపకాలు సమానంగా జరగాలని నిలదీస్తే గ్రామపెద్దల సమక్షంలోనే తమపై దాడిచేశాడని బాధితుడు విజయ్‌కుమార్‌ ఆరోపించాడు. ఈ విషయంలో భూమి ఇవ్వనంటూ హెచ్చరించి తమను భయభ్రాంతులకు గురిచేసిన విషయంలో న్యాయం చేయాలని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్‌ తెలిపారు.

ఎన్‌హెచ్‌–167పై అంధకారం

- మెట్టుగడ్డ నుంచి ఏనుగొండ వరకు వెలగని విద్యుత్‌ దీపాలు
- 10 రోజులవుతున్నా పట్టించుకోని మున్సిపల్‌ అధికారులు



మెట్టుగడ్డ వద్ద వెలగని వీధి దీపాలు

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ఎన్‌హెచ్‌–167పై సుమారు పది రోజులుగా అంధకారం అలుముకుంది. ముఖ్యంగా మెట్టుగడ్డ నుంచి ఏనుగొండ వరకు రాత్రివేళ విద్యుత్‌ దీపాలు వెలగకపోవడంతో వాహనాల వెలుతురుతోపాటు అటు, ఇటు ఉన్న దుకాణాల లైటింగే శరణ్యమైంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం దక్కడం లేదని వారు వాపోతున్నారు. కాగా, ఎంఈ యు.బస్వరాజ్‌ను వివరణ కోరగా ఎన్‌హెచ్‌–167పై మార్గమధ్యంలో ఇటీవల కేబుల్‌ కాలిపోయిందన్నారు. కొత్త కేబుల్‌ తెప్పించి త్వరలో వీధి దీపాలు వెలిగేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

10న సామూహిక ఇష్టలింగ పూజ

మెట్టుగడ్డ: పవిత్ర శ్రావణమాసం సందర్భంగా ఈనెల 10న ఆదివారం సామూహిక ఇష్టలింగ పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షుడు ముక్తా శ్రీశైలం, వీరశైవ లింగాయత్‌ లింగ బలిజ అధ్యక్షుడు కొండ వీరణ్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం స్థానిక వీరన్నపేటలోని విశ్వ లింగాయత్‌ పరిషత్‌ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. విశ్వలింగాయత్‌ భవనంలో ఈనెల 10న ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఇష్టలింగ పూజా కార్యక్రమం శ్రీమద్‌ కాశీ సింహాసనాధీశ్వర 1008, శ్రీచంద్రశేఖర శివాచార్య మహాస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. లింగ బలిజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు గురుపాదస్వామి, శివరాజయస్వామి, శివకుమార్‌, వినోద్‌కుమార్‌, మృత్యుంజయ, బసప్ప పాల్గొన్నారు.

రసాయనిక మందులు తాగి మేకలు మృతి

గండీడ్‌: పామాయిల్‌ తోటకు పిచికారీ చేయడానికి కలిపి ఉంచిన రసాయనిక ఎరువుల ద్రావణాన్ని తాగి 13 మేకలు మృతి చెందిన ఘటన మండలంలోని జంగంరెడ్డిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జంగంరెడ్డిపల్లికి చెందిన మేకల కాపరి గుట్ట కేశవులు పామాయిల్‌ తోటలో పనిచేస్తూ మేకలను పెంచుకొని జీవనం సాగిస్తున్నాడు. అయితే పామాయిల్‌ తోటకు పిచికారీ చేసేందుకు యూరియా, పొటాష్‌ ద్రావణాన్ని కలిపి ఓ డ్రమ్ములో ఉంచాడు. ఆ ద్రావణాన్ని తోటకు పిచికారీ చేద్దామనుకునే లోపు తను పెంచుకొన్న మేకలు అనుకోకుండా డ్రమ్ములో ఉన్న ద్రావణాన్ని తాగేశాయి. దీంతో అవి తీవ్ర అస్వస్థతకు గురయి అక్కడికక్కడే మృతి చెందాయి. సమాచారం అందుకున్న ఆర్‌ఐ యాసిన్‌, పశువైద్య సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. నివేదికను ప్రభుత్వానికి పంపిచనున్నట్లు వారు తెలిపారు. తాను అప్పులు చేసి బతుకుదెరువు నిమిత్తం మేకలను కొనుక్కున్నాని, అంతలోనే అవి మృత్యువాత పడ్డాయని మేకల కాపరి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

ఇందిరమ్మ ఇళ్లు నాణ్యతతో నిర్మించుకోవాలి



నాగారంలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న పీడీ వైద్యం భాస్కర్‌

దేవరకద్ర: ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని జిల్లా హౌసింగ్‌ పీడీ వైద్యం భాస్కర్‌ సూచించారు. మంగళవారం మండలంలోని నాగారంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పనులు చేస్తున్న మేస్త్రీలు, ఇతర కూలీలు ఎక్కువ కూలీ డబ్బులు డిమాండ్‌ చేస్తున్నట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారని తెలిపారు. మేస్త్రీలు, కూలీలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలని కూలిరేట్లను గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీలు నిర్ణయించాలని సూచించారు. లబ్ధిదారులు చాలామంది పేదవారని.. వారు ఆర్థిక భారం మోయలేరని తెలిపారు. అయితే నాణ్యతలో మాత్రం సడలింపు ఉండదని నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని కోరారు. నిర్మాణానికి చెల్లించే బిల్లులు నిబంధనల ప్రకారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ పనులు ప్రారంభించని వారు వెంటనే పనులు మొదలు పెట్టాలని కోరారు. అనంతరం గ్రామంలో ఇంకా గుడిసెల్లో ఉంటున్న వారి వద్దకు వెళ్లి వెంటనే ఇంటి పనులు ప్రారంభించాలని కోరారు. పీడీ వెంట ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన 'అక్షర' విద్యార్థిని



పౌర్ణమిని అభినందిస్తున్న అక్షర కళాశాల కరస్పాండెట్‌ విజయ్‌కుమార్‌

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని అక్షర జూనియర్‌ కళాశాలలో ఇంటర్‌ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పౌర్ణమి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తాచాటింది. ఈమేరకు ఈనెల 3, 4వ తేదీల్లో హనుమకొండలో జరిగిన 11వ తెలంగాణ అథ్లెటిక్స్‌ చాంపియన్స్‌లో అండర్‌–18 విభాగంలో డిస్కస్‌ త్రోలో మొదటిస్థానం పొంది గోల్డ్‌మెడల్‌ సాధించింది. షాట్‌పుట్‌లో మూడోస్థానం సాధించి బ్రౌంజ్‌మెడల్‌ పొందింది. ఈ సందర్భంగా మెడల్స్‌ సాధించిన విద్యార్థినిని కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కరస్పాండెట్‌ విజయ్‌కుమార్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామస్తుల హర్షం

మిడ్జిల్‌: హన్మకొండలోని జేఎన్‌ స్టేడియంలో ఈనెల 3, 4వ తేదీల్లో జరిగిన 11వ తెలంగాణ అథ్లెటిక్‌ పోటీల్లో మిడ్జిల్‌ మండలంలోని మల్లాపూర్‌కు చెందిన అన్నాచెల్లెల్లు జ్ఞానేశ్వర్‌రెడ్డి, పౌర్ణమి ప్రతిభ చాటడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మార్కెట్‌ సమస్యల పరిష్కారానికి మరింత కృషి



జడ్చర్లలో క్షీరాభిషేకం చేస్తున్న చైర్‌పర్సన్‌ జ్యోతి, సభ్యులు

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఉన్న సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తామని మార్కెట్‌ చైర్‌పర్సన్‌ జ్యోతి తెలిపారు. మంగళవారం మార్కెట్‌ యార్డులో గాల్వాల్యూమ్‌ షీట్‌ రూఫింగ్‌తో కూడిన షెడ్‌ నిర్మాణానికి తమ ప్రభుత్వం రూ.1.75 కోట్లు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ యార్డు ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యార్డుకు రైతులు తీసుకొచ్చే పంట దిగుబడులు వర్షం సమయంలో తడిసిపోవడం, కొట్టుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటారని, తాము ఆ సమస్యలను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో షెడ్‌ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. దశలవారీగా యార్డులో సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ రాజేందర్‌గౌడ్‌, డైరెక్టర్లు ఖాజాపాషా, సత్యంగౌడ్‌, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న యూపీఎస్‌సీ సంఘం నాయకులు

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు వెంకటేశ్‌, రవికుమార్‌, రవీందర్‌గౌడ్‌, మహమూద్‌ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని, మౌలిక వసతులు లేని కారణంగా పాఠశాలల్లో విద్యార్థులను చేర్పేందుకు తల్లిదండ్రులు మొగ్గుచూపడంలేదని, ప్రభుత్వం ఏర్పడి 19నెలలు గడుస్తున్నా.. సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. వీటి పరిష్కారం కోసం దశలవారీ పోరాటం చేస్తామన్నారు. 2023లో రావాల్సిన పీఆర్సీని ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వడం లేదని, ఉపాధ్యాయులకు సంబంధించిన రూ.వేలకోట్లు ఈ కుబేర్‌లో ఏళ్ల తరబడి మూలుగుతున్నాయని, ప్రతినెల రూ.700 కోట్లను చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ, డైట్‌ అధ్యాపకులు, పోస్టులను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కిష్టయ్య, నారాయణమ్మ, నర్సింహులు, ఉమాదేవి, వేణుగోపాల్‌, జయంతి, హేమంత్‌, శ్రీను, మన్యం తదితరులు పాల్గొన్నారు.